## ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఆయకట్టు రైతులకు ఊరట

- ఆర్డీఎస్ ఆనకట్టకు నీటి విడుదల
- 23 రోజుల పాటు 2.230 టీఎంసీల విడుదల

అయిజ, నవంబర్ 6 : ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఆయకట్టు పరిధిలో బోర్లు, బావులు, చెరువులు కలిగి పంటలు సాగు చేసుకున్న రైతులకు ఊరట కలుగనుంది. కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్ ఇండెంట్ నీటిని విడుదల చేశారు. 23 రోజుల పాటు 2.230 టీఎంసీల నీటిని తుంగభద్రా డ్యాం నుంచి ఆర్డీఎస్ ఆనకట్టకు ఇండెంట్ విడుదల చేయాలని తెలంగాణ జలవనరుల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ బీటీ బో ర్డుకు ఇండెంట్ పెట్టారు. దీంతో టీబీ బోర్డు అధికారులు నీటిని తుంగభద్ర నదీలోకి విడుదల చేశారు. ఆర్డీఎస్ నీటి వాటాలో భాగంగా మొదట నాలుగు రోజులు 1, 700 క్యూసెక్కులు, 19 రోజులు వెయ్యి క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఆర్డీఎస్ ఆయకట్టుకు 3.230 టీఎంసీలను తుంగభద్ర బోర్డు కేటాయింపులు జరుపగా, వర్షాభావ పరిస్థితుల కారణంగా గత నెలలో ఒక టీ ఎంసీని విడుదల చేయగా, ప్రస్తుతం 2.230 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఈ నెలా 8 నాటికి ఆర్డీఎస్ ఆనకట్టకు నీరు చేరుకుంటుందని ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం వచ్చే నీటితో ఇప్పటికే సాగు చేసుకున్న రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పులికల్, చిన్న తాండ్రపాడు చెరువులను నింపుతామన్నారు. తుంగభద్రా నదిలోకి నీరు పుష్కలంగా చేరగానే తుమ్మిళ్ల పథకం పంపులు ప్రారంభిస్తామని ఈఈ పేర్కొన్నారు.



టీబీ డ్యాం నుంచి తుంగభద్రా నదిలోకి విడుదలవుతున్న నీరు

### ఆర్డీఎస్ ఆనకట్టకు వరద

కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద వచ్చి చేరుతోంది. గ త మూడు రోజులుగా ఎగువ ప్రాంతం లో మోస్తారులో కురుస్తున్న వానలకు ఆనకట్టకు ఇన్‌ఫ్లో చేరుతోంది. సోమవారం 862 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 748 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 446 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.2 అడుగుల మేర నీటి మట్టం ఉం ది. ఎగువన ఉన్న తుంగభద్ర జలాశయాని కి ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 9,179 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 28.158 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ట నీటి మట్టానికి గాను, ప్రస్తుతం 1604.65 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

## అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డేపల్లి, నవంబర్ 6 : మండల కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుల నియామకానికి అర్హతగల వారు ఈ నెల 8వ తేది సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తేదీన గద్వాలలోని ఎంఎఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించి అర్హతగల వారిని ఎంపిక చేస్తామన్నారు.



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న దృశ్యం

## ఉత్తీర్ణతశాతం పెంచడానికి ప్రత్యేక తరగతులు

వడ్డేపల్లి, నవంబర్ 6 : శాంతినగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పదో తరగతిలో ఉత్తీర్ణతశాతం పెంచడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం శామ్యూల్ అన్నారు. లక్ష్య మాడ్యూల్లో తెలిపిన విధంగా ఉదయం, సాయంత్రం ఒక గంట అదనంగా తరగతులు నిర్వహిస్తున్నామని స్లిప్‌టెస్ట్‌లు, ఎఫ్‌ఏత్రీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం పదోతరగతిలో 84 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాలలో సౌకర్యాలు బాగా ఉన్నాయని, విద్యార్థుల హాజరు సంఖ్య పెరిగిందని హెచ్‌ఎం అన్నారు. కార్యక్రమంలో శేషన్, అజయ్‌కుమారి, చెన్నారెడ్డి, జావిద్, సురేశ్, శేషమ్మ, దావిద్, జనార్దన్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఎక్లాస్‌పురంలో జీవాలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

## జీవాలకు పారుడురోగ నివారణ టీకాలు

అయిజరూరల్, నవంబర్ 6 : మండలంలోని ఎక్లాస్‌పురం, బింగిదొడ్డి గ్రామాల్లో మండల పశువైద్యాధికారిణి స్వరూపరాణి ఆధ్వర్యంలో సోమవారం పశువైద్యసిబ్బంది జీవాలకు పారుడురోగ నివారణ టీకాలను వేశారు. ఇందులో మొత్తం 9మందికి చెందిన 3,459 జీవాలకు టీకాలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది సుధాకర్,మధు,గట్టుమూర్తిలు పాల్గొన్నారు.

## సరిహద్దులో కొనసాగుతున్న వాహన తనిఖీలు

ఉండవెల్లి, నవంబర్ 6 : 44వ జాతీయ రహదారి పుల్లూరు టోల్‌గేట్ దగ్గర ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌లో ప్రత్యేక పోలీస్ బృదం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, బెంగుళూరు నుంచి వచ్చే వాహనదారులకు తెలంగాణ రాష్ట్రంలో ఆమలవుతున్న ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర బలగాలు, రాష్ట్రపోలీస్ బృందాలు తనిఖీలు చేసి రాష్ట్రంలోకి వాహనదారులకు అనుమతులు ఇచ్చారన్నారు.



పుల్లూరు చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు

గద్వాల అర్బన్, నవంబర్ 6 : ఎవరైనా మద్యం సరఫరా చేసినా, అక్రమంగా విక్రయాలు జరిపినా కఠినచర్యలు తీసుకుంటామని ఆబ్కారీశాఖ సీఐ గోపాల్ పేర్కొన్నారు. సోమవారం అయిజ మండల పరిధిలోని కుటకనూర్ గ్రామంలో అక్రమ మద్యం విక్రయ కేంద్రాన్ని గుర్తించి తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. అక్రమ మద్యం బాటిళ్లను సీజ్‌చేసి స్వా ధీనం చేసుకున్నారు. అనంతరం విక్రయం చేస్తున్న ఇద్దరు వ్యక్తులు చాంద్ సాహెబ్, బోయ రామన్నలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎసైలు గోవర్ధన్, రాజేందర్‌రెడ్డి, సిబ్బంది షబ్బీర్, రాజు తదితరులు ఉన్నారు.

## ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలి

- ఆర్డీవో చంద్రకళ

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 6 : ఓపీవోలు ఎన్నికలు పారదర్శకంగా జరిగేవిధంగా చూడాలని ఆర్డీవో చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఈవీఎం యంత్రాల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో చంద్రకళ అన్నారు. ఎర్రవల్లి చౌరస్తా ఏకశిల పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆర్డీవో సోమవారం రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ శిక్షణ పొందిన ఫీల్డ్‌తో పాటు పోలీంగ్‌బూత్‌లలో సమర్ధవంతంగా ఎన్నికలు నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్‌ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. శిక్షణ తరగతులను అర్థంచేసుకొని ఎన్నికల విధులకు సంబంధించిన అన్నిఅంశాలపై పరిపూర్ణమైన అవగాహనను ఏర్పాటు చేసుకోవాలని, ఇదివరకు ఎన్నికల విధులు నిర్వర్తించిన వారుసైతం శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు నిబంధనలును స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల విధులకు సంబంధించిన నియమ నిబంధనలతో కూడిన పూర్తి సామగ్రిని అందించడం జరిగింది. జాగ్రత్తగా విధులు నిర్వర్తిస్తే ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండదన్నారు. ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్‌ను ఉదయం ఆరు గంటలకు చేపట్టాలని సూచించారు. మాక్‌పోల్ నిర్వహించిన తరువాత తప్పనిసరిగా సమాచారం మొత్తం క్లియర్ చేసుకోవాలని జిల్లాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా పారదర్శకంగా జరిగేందుకు కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. పోలింగ్ జరిగే సమయంలో పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలపై పూర్తి అవగాహన కల్గి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ సుబ్రమణ్యం, మంజుల, ఆర్ఐ సుదర్శన్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తరగతులను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రకళ

## విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలి

మల్దకల్, నవంబర్ 6 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయ రాజు ఆకస్మిక తనిఖీలో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన కళశాలలో అధ్యాపకుల విద్యాబోధనపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అలాగే గతేడాది కళాశాల ఉత్తీర్ణత శాతంపై ఆరా తీశారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూడాలన్నారు. విద్యార్థులు రాకుంటే వారి తల్లిదండ్రులతో సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. క్రమశిక్షణతో విద్యార్థులు చదివే విధంగా ప్రత్యేక ప్ర ణాళిక తయారు చేసి చదివేలా ప్రయత్నం చేయాలన్నారు. డిసెంబర్ చివరి వరకు సిలబస్ పూర్తి చేయాలని జనవరి నుంచి రివిజన్ చేయించాలన్నారు. గత సంవత్సరం కంటే ఈ సారి ఉత్తీర్ణతశాతం పెంచాలని సూచించారు. కళాశాల రికార్డులను పరిశీలించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్‌లింగం, అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, భాగ్యలక్ష్మి, గోవర్ధన్‌శెట్టి, అధ్యాపకులు ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గురువు పాత్ర విశిష్టమైనది




చిన్నోనిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న సభ్యులు

గట్టు, నవంబర్ 6 : గురువు పాత్ర విశిష్టమైనదని వక్తలు అన్నారు. మండలంలోని చిన్నోనిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేవుడే మనిషిగా జన్మిస్తే గురువవుతాడన్నారు. గురువు గుండ్రాయి లాంటి వాడన్నారు. ఆది, అంతము లేని విధంగా గుండ్రాయి ఏ విధంగా ఉంటుందో గురువు కూడా అవే వర్తిస్తాయన్నారు. గురువుల బోధనలను విధిగా విని వాటికి ఆచరించాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మణ్, ఈరన్న, వెంకటేశ్, రామచంద్ర, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 8న గట్టు మండల సమావేశం

గట్టు, నవంబర్ 6 : మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 8వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చెన్నయ్య ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు. అన్నిశాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి రావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ దవాఖానలోనే కాన్పు సురక్షితం

అలంపూర్, నవంబర్ 6 : ప్రభుత్వ దవాఖానలో కాన్పు సురక్షితమని, ప్రతి కాన్పుకు ప్రభుత్వం కేసీఆర్ కిట్‌తో పాటు నగదు రూపేనా పారితోషకం అందజేస్తుందని జిల్లాప్రోగ్రాం ఆఫీసర్ స్రవంతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశలకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో అవగాహన కల్పించారు. అనంతరం మానసిక రోగి లక్షణాలు, ప్రవర్తన తదితర అంశాలపై మానసిక వైద్య నిపుణులు డాక్టర ప్రదీప్ వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రసూణరాణీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్,పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది